చదువుకుంటే ఎక్కడైనా రాణించగలం



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

- నర్కూడలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభం
- 19 వరకు బడిబాట : కలెక్టర్ శంశాక

శంషాబాద్ రూరల్: విద్య ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు.. చదువుంటే ఎక్కడైనా రాణించగలం.. చదువుకు దూరమైన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక కోరారు. మండలంలోని నర్కూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఆయన బడిబాటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరానికి సమీపంలోని జిల్లా ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులు చాలా మంది ఉన్నారని, వారి పిల్లలు చదువుకు దూరం కాకుండా గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలోని 5 ఏళ్లు పైబడిన పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడానికి చర్యలు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరించడంతో పాటు వారి పిల్లలు బడికి వెళ్లేలా చూడాలన్నారు. చదువుకున్న వారు భవిష్యతులో ఏదైనా సాధిస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో చాలామంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, మంచి చదువు లభిస్తుందన్నారు. భవిష్యతుల్లో మనం ఏ స్థాయికి చేరుకోవాలన్నా.. మన చేతుల్లో తప్పా పుట్టి, పెరిగిన ప్రాంతాల పరిస్థితులు కావని చెప్పారు. ఈ నెల 19 వరకు జరిగే బడిబాటను జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులకు సన్మానం..

పదో తరగతిలో 9.7 మార్కులు సాధించిన నర్కూడ పాఠశాల విద్యార్థులు కార్తీక వీణా, అనుష్కను కలెక్టరు సన్మానించారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుపై విద్యార్థులకు అవగాహన పెంచి ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ మున్నీ, సీడీపీఓ షబానా, ఎంఈఓ రాంరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబోయ్..భౌభౌలు



కాలనీలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు   వీధి కుక్క దాడిలో గాయపడ్డ చిన్నారి



భుజంపై వీధి కుక్క దాడి చేసిన గాయాలు

- బండ్లగూడజాగీర్‌లో కుక్కల స్వైర విహారం
- ఇద్దరు చిన్నారులు, మహిళపై కుక్కల దాడి
- భయాందోళనలో స్థానిక ప్రజలు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేయర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట వీధి కుక్కల బారిన పడి జనాలు గాయాల పాలవుతున్నారు. తాజాగా వికాస్‌నగర్ కాలనీలో వీధి కుక్కలు ఇద్దరు చిన్నారులతో పాటు ఒక మహిళపై దాడి చేసి గాయపర్చాయి. విషయం తెలుసుకున్న మేయర్ లతా ప్రేమ్‌కుమార్‌గౌడ్ బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. వీధికుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల బెడద అధికం..

కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్‌ఖాన్, బండ్లగూడ, హిమయత్‌సాగర్, పీరంచెరువు, గంధంగూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు ఒంటరిగా కనిపిస్తే చాలు కుక్కలు దాడికి దిగి గాయపరుస్తున్నాయి.

గతంలో 15 నెలల చిన్నారిపై దాడి..

గతంలో యాదమ్‌మిత్ర కాలనీలో 15 నెలల చిన్నారి ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్క ఆ చిన్నారిపై ఒక్కసారిగా దాడి చేసి తొడ భాగంపై కరిచింది. చిన్నారి అరవడంతో వీధి కుక్క పారిపోయింది. అరుపులు విన్న తల్లిదండ్రులు బయటకు వచ్చి చూసేసరికి తొడ భాగంపై రక్తం రావడంతో ఏమిజరిగిందో అని ఆందోళన చెందారు. ఈ దృశ్యం మొత్తం ఆ వీధిలోని సీసీ కెమెరాల్లో రికార్డయింది.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతాం..



వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. చిన్నారులపై దాడి చేయడం బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతాం. కుక్కల జనన, నియంత్రణతో పాటు రేబిస్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటాం.

– లతా ప్రేమ్‌కుమార్ గౌడ్, మేయర్ బండ్లగూడ జాగీర్

900పైగా శునకాలకు శస్త్ర చికిత్స..

గతంలో వీధి కుక్కల సంతతిని తగ్గించేందు మున్సిపల్ అధికార యంత్రాంగం 900కు పైగా శునకాలకు శస్త్ర చికిత్సలు చేసి వదిలేశారు. దీంతో వాటి బారి నుంచి కొంత విముక్తి కల్పించారనుకుంటే, ప్రస్తుతం వేరే ప్రదేశాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలను తెచ్చి కార్పొరేషన్ పరిధిలో వదిలేస్తుండటంతో మళ్లీ కుక్కల సంతతి బాగా పెరిగిపోయింది. అధికారులు తగు చర్యలు తీసుకొని కుక్కల బారినుంచి రక్షించాలని కోరుతున్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి లక్ష 70 వేల భారీ మెజార్టీతో గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు కలిశారు. నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సీహెచ్ బిక్షపతి యాదవ్, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, నాగేష్‌యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థులు తల్లిదండ్రులు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జమీర్ ఫాతిమా, ఎస్ఎంసీ చైర్ పర్సన్ వాణి అన్నారు. అత్తాపూర్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులు సువిశాల పాఠశాల గదులు విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా స్థలాలు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటాయని పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులుగా మేమంతా సిద్ధంగా ఉన్నామని ప్రమాణం చేశారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకునేందుకు రోజుకు ఒక విధంగా అనుసరించాల్సిన పద్ధతులను విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నాగమణి, సౌమ్యశ్రీ, రజియా బేగం, మాణయ్య, గోపికృష్ణ, జహిరా బేగం, రోజా, రాణి, హేమలత, జ్యోతి, ఎం.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అలకాపూర్ సమస్యలు తీర్చండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అలకాపూర్ టౌన్‌షిప్ నాయకులు

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను సంక్షేమ సంఘం నాయకులు కోరారు. గురువారం అలకాపూర్ టౌన్‌షిప్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలకాపూర్ టౌన్‌షిప్‌లో పలు రోడ్ల అభివృద్ధి, వీధి దీపాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను నివారించాలని, స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయాలని, సైన్ బోర్డులను తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, నాలాలను క్లీన్ చేయాలని, మ్యాన్‌హోల్‌ల మరమ్మతులు చేపట్టాలన్నారు. వాకింగ్ ట్రాక్‌ల మెయింటెనెన్స్, వృక్షాలను కొట్ట కుండా కఠిన చర్యలు తీసుకోవావాలని, అదే విధంగా టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని, రాబోయే కౌన్సిల్ సమావేశంలో వీటికి నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందిద్దాం

ప్రతిజ్ఞ చేసిన ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ఉద్యోగులు



పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మణికొండ: భావితరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించే బాధ్యత నేటితరంపై ఉందని ఔటర్‌రింగ్ రోడ్డు నిర్వహణ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే సంస్థ ఉద్యోగులు అన్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. గురువారం పుప్పాలగూడ ఔటర్ రింగ్ రోడ్డు టోల్‌గేట్ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలన్నారు. వాటితో మరింత స్వచ్ఛమైన గాలి మనకు వస్తుందన్నారు. ఈ సంరద్భంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని, చెట్లు పెంచుతామని, ఇంధనాన్ని వృథా కానివ్వబోమని, మానవ నిర్మిత విధ్వంసాల నుంచి భూమాతకు రక్షణ కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులతో పాటు హెచ్‌ఎండీఏ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి కూలీలకు రోజు కూలీ రూ.600 ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

రాజేంద్రనగర్: ఉపాధి హామీ కూలీలు చాలీచాలని కూలీ డబ్బులతో పొట్టనిండక, పూట గడవక ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కలకొండ కాంతయ్య మండిపడ్డారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకెఎంయూ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జె.అంజయ్య అధ్యక్షతన రాజేంద్రనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పని చేస్తున్న దగ్గర కనీస సౌకర్యాలైన టెంట్లు, మంచినీళ్లు, వైద్య కిట్లు, రవాణా సౌకర్యం తదితర వసతులు లేకుండా కూలీలతో నరేంద్ర మోదీ ప్రభుత్వం చాకిరీ చేయించుకుంటుందన్నారు. రెండు నెలలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తుంటే రిజిస్టర్‌లో పేర్లు సరిగ్గా లేవని బిల్లులు ఇవ్వకుండా చాలా మంది బిల్లులను ఆపిన పరిస్థితి ఉందని వెంటనే వారికి బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలందరికి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, రెండు వందల రోజులు పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకానికి సంవత్సరానికి 2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, కార్య నిర్వాహక అధ్యక్షులు ఎస్.లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులు లింగమయ్య, రాములు, వెంకటేశ్, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శివారు, ఔటర్‌రింగ్ రోడ్డు పక్కనే ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మొదటి రోజు ఉదయం స్వస్తి వాచనము, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనము, రక్షా బంధనం, హారతి, ప్రసాద గోష్టిలు ఉంటాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం మత్స్యంగ్రహణము, అంకురారోహణము ఉంటాయన్నారు. శనివారం ధ్వజారోహణము, బలిహరణము, హారతి, ప్రసాద గోష్టి, భేరి పూజ, దేవతాహ్వానము, హనుమంత వాహన సేవలు ఉంటాయన్నారు. ఆదివారం స్వామి వారి అష్టోత్తర శత కలశాభిషేకం, గరుడ వాహనసేవ, ఎదురుకోళ్లు, రాత్రి 7గంటలకు శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం ఉంటాయన్నారు. 10వ తేదీ సోమవారం సహస్రనామ పుష్పార్చన , ఉంజల్‌సేవ, సాయంత్రం శేషవాహన సేవ, రథోత్సవం ఉంటాయని తెలిపారు. 11వ తేదీ మంగళవారం మహాపూర్ణాహూతి, చక్రస్నానము, సాయంత్రం అశ్వవాహన సేవ, ద్వాదశ ఆరాధన, దేవతా విసర్జన, రుత్విక్ సన్మానాలతో ఉత్సవాలు ముగుస్తామన్నారు. స్వామివారి ఉత్సవాలు ప్రతి సంవత్సరం మాదిరిగానే డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ ఎండీ సంతోష్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో జాబితా విడుదల

శంషాబాద్ రూరల్ : మండలంలోని పాల్మాకులలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల అర్హుల జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరిగిందన్నారు. జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వచ్చి ప్రవేశం పొందాలన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లేష్ (ఫైల్)

శంషాబాద్ రూరల్ : బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాల్మాకులకు చెందిన డ్రైవర్ మల్లేష్ (35), అనూష దంపతులు ఈ నెల 1న పెద్ద షాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు 2వ తేదీన ఉదయం వ్యక్తిగత పని నిమిత్తం పాల్మాకులకు వెళ్తున్నట్లు తెలిపి అక్కడ నుంచి మల్లేష్ వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో గురువారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలకు తల్లిదండ్రులే మార్గదర్శకులుగా ఉండాలి



దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్

గోల్కొండ: పిల్లలకు వారి తల్లిదండ్రులే మార్గదర్శకులుగా ఉండాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన పలువురు యువ దంపతులకు పిల్లలు, వారి చదువుపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను చదివించడానికి ప్రైవేటు పాఠశాలలే కానవసరం లేదన్నారు. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతను బట్టి పిల్లల చదువు కోసం స్కూల్‌లను ఎన్నుకోవాలని ఆయన సూచించారు. తమ ఆర్గనైజేషన్ అర్హులైన పేద పిల్లల ఉన్నత చదువుల కోసం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉన్నత చదవులతో పాటు హైస్కూల్ చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు తాము కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారు సరైన నిర్ణయాలు తీసుకునే విధంగా కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు.

వందశాతం చెత్త సేకరణకు కృషి



సంజయ్‌గాంధీనగర్‌లో చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

ప్రజలకు అవగాహన కల్పించిన కమిషనర్ బి. శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను క్రమం తప్పకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. గురువారం సంజయ్‌గాంధీనగర్, ఇంద్రారెడ్డినగర్‌లలో చెత్త సేకరణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించి చెత్తను ప్రతి రోజూ కార్మికులకు అందించాలని సూచించారు. అలాగే కాళీమందిర్ మెయిన్ రోడ్డుపై జరుగుతున్న స్వీపింగ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ కార్మికులు ప్రతి రోజు ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరిస్తున్నారన్నారు. కానీ కొంత మంది చెత్తను వారికి ఇవ్వకుండా రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారన్నారు. దీని కారణంగా ఆయా ప్రాంతాలన్ని దుర్గంధ భరితంగా మారుతున్నాయన్నారు. ప్రజలు కార్మికులకు పూర్తిగా సహకరిస్తూ చెత్తను వారికి అందిస్తూ నగర సుందరీకరణకు పాటుపడాలన్నారు.

బంగ్లా మురుగునీరు పొలాల్లోకి...

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యజమానులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి



పొలాల్లోకి చేరుతున్న మురుగునీరు

శంషాబాద్: ఓ భారీ బహుళ అంతస్తుల భవనంలోని మురుగునీరు పొలాల్లోకి పారుతుండడంతో సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ వెనకాల హిమాయత్‌సాగర్ వైపు ప్రవహించే కాల్వకు సమీపంలోని భారీ బహుళ అంతస్తుల భవనంలో ఇటీవల ప్రైవేటు కళాశాల ప్రారంభించారని అందులోని మురుగునీటిని సదరు యాజమాన్యం ఏకంగా పొలాల్లోకి పారే విధంగా కాల్వ చేసి వదిలేయడంతో గురువారం సమీప పొలాల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నేపథ్యం కారణంగానే సదరు యజమానులు ఇష్టారాజ్యంగా మురుగునీటిని తమ పొలాల్లోకి వదిలేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొలాల్లోకి మురుగునీరు వదిలితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రస్తుతం సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో మురుగునీరు పారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

నాలా క్లీనింగ్ పనులను వేగవంతం చేయండి

మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



పంచవటి కాలనీ వాగువద్ద పనులను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి, ఏఈలు

మణికొండ: వర్షాకాలం ప్రారంభం అయ్యిందని, దానికి అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలోని పందెన్‌వాగు నాలాలో నీరు వేగంగా వెళ్లేలా క్లీనింగ్ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మున్సిపాలిటీ ఏఈ సాయి మౌనిక, సిబ్బందితో కలిసి నాలా వద్ద కొనసాగుతున్న క్లీనింగ్ పనులను పరిశీలించారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో నాలాలోని నీరు పొంగి పంచవటి కాలనీలోకి వచ్చి ప్రజలను ముంపునకు గురిచేస్తుందన్నారు. వరద నీరు కాలనీలోకి రాకుండా నాలా వెంట రిటర్నింగ్ వాల్ నిర్మించి అరికట్టామని, నాలా క్లీన్‌గా ఉంటే ముంపు సమస్య ఈ సంవత్సరం రాకుండా ఉంటుందన్నారు. ట్రయల్స్ విల్లాల వద్ద బాక్స్‌డ్రైన్ పనులు పూర్తి కావటంతో నీరు వేగంగా కిందకు వెళ్లిపోతుందన్నారు. పంచవటి కాలనీలో కొన్ని మురుగు కాలువలు నిండి ఉన్నాయని, వాటిని క్లీన్ చేయించాలని ఏఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచవటి కాలనీ వాసులు పాల్గొన్నారు.

మన రక్షణ కోసమే ట్రాఫిక్ నిబంధనలు

ట్రాఫిక్ ఎస్సై రాజేశ్‌గౌడ్



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

మణికొండ: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అవి మన రక్షణ కోసమే ఏర్పాటు చేసుకున్నామని మరువద్దని నార్సింగి ట్రాఫిక్ ఎస్సై రాజేశ్‌గౌడ్ అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట టీ గ్రిల్ జంక్షన్‌లో వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్‌ను, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్‌లను పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్‌ల వద్ద నిబంధలను పాటించినప్పుడే అందరూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోఆర్డినేటర్ కేశవ్‌తో పాటు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు నితా వడ్డేరి, దిలిప్ కక్కడ్, రాజశేఖర్‌రెడ్డి, జయకర్, శ్రీనివాస్, మహేష్‌కుమార్, నాగేష్, కల్యాణి, రాజిరెడ్డి, శ్రీకాంత్, పాల్‌రాజ్, వైభవ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మానసిక తృప్తి



అన్నదానం చేస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: అన్నదానం లాంటి సేవా కార్యక్రమాలతో మానసిక తృప్తిని ఇస్తాయని మణికొండ వాసవి వెల్ఫేర్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. గురువారం అమావాస్య సందర్భంగా మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రామన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు తమ అసోసియేషన్ తరఫున ఆకలితో ఉన్న వారికి భోజనాన్ని అందించాలని నిర్ణయించి అమలు చేస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో మానసిక తృప్తితో పాటు పేదల ఆకలి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, పేదలు పాల్గొన్నారు.

17న ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17వ తేదీ ఉదయం 5.30 గంటలకు షిర్డీ సాయిబాబాకు కాగడ హారతితో ఈ వేడుకలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, రుద్ర హోమం, నవగ్రహహోమం సాయంత్రం 4 గంటలకు సాయిబాబా పల్లకిసేవ (నగరసంకీర్తన) కార్యక్రమాన్ని ఉంటుందన్నారు. సాయంత్రం 6.15 గంటలకు సంధ్యాహారతి (ధూప్ హారతి) నిర్వహిస్తామని, ఆ తర్వాత సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భజన బృందంచే ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి 9 గంటలకు శేజ్ హారతి కార్యక్రమం నిర్వహణతో వేడుకలను ముగించనున్నట్లు తెలిపారు.

‘ప్రజలకు అందుబాటులో ఉంటా’



విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న వంశీ

గోల్కొండ: తనను ఎన్నుకున్న ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని చేవెళ్ల ఎంపఇు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎంపీగా ఎన్నికైన సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ తన అనుచరులతో గురువారం ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మూడోసారి మళ్లీ ప్రధాని కావడం దేశానికే గర్వకారణమన్నారు. యువత కోసం గత పదేళ్లల్లో ప్రధాని మోదీ లక్షల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. రానున్న ఐదేళ్లల్లో ప్రధాని మనదేశాన్ని అగ్రదేశంగా తీర్చిదిద్దడం ఖాయమని ఆయన అన్నారు.